# రత్తమ్మ కష్టాలు

రత్తమ్మ తల్లికి రారాని కష్టాలే వచ్చాయి. సీతమ్మ వారి చెఱ అనుభవిస్తుందంటే నమ్మండి!

ఆమాటకొస్తే ఆమెకున్నన్ని కష్టాలు ఆ సీతమ్మ వారికి ఎక్కడున్నాయ్ ?

రాక్షసముండా కొడుకైనా ఆ రావణాసురుడు ఆమెను తీసుకెళ్ళి దేవతావనంలాంటి అందమైన అశోకవనంలో, దాసదాసీలమధ్య వుంచాడు. ఆమెకు వచ్చిన కష్టమల్లా కానిదేశంలో, నా అనేవాళ్ళులేని చోట, నిమిషమొక యుగంగా భర్తకోసం నిరీక్షిస్తూ కూర్చోవడమేగా ?

కాని రత్తమ్మ తల్లికి, తను పుట్టిన ఊళ్లోనే, ఐనవాళ్ళ మధ్యనే, చెట్టంత భర్త రక్షణలోనే ఇన్ని కష్టాలూ వచ్చాయి.

నిద్రమంచం దిగిన దగ్గరనుంచీ, మళ్ళీ రాత్రి మంచం ఎక్కేంతవరకూ అన్నీ కష్టాలే! అన్నీ అవాంతరాలే!

అప్పుడే సుష్టుగా భోజనంచేసి, పంచలో గుంజకాను కొని కూర్చొని ఆపసోపాలు పడసాగింది రత్తమ్మ.

రామ ! రామ ! ఈమాయదారి మంద ఒక్క క్షణం శాంతంగా కూర్చొని చావనివ్వరుగదా? ఎంత డబ్బుంటే నేం? ఎంత హోదా వుంటేనేం ? సుఖపడే గీత వుండొద్దూ ? అసలు ఈ డబ్బూ, హోదా పెరిగిన కొద్దీ కష్టాలూ పెరుగు

తున్నాయ్. పూటకూటికి గతిలేని పక్కింటి పార్వతి తన కంటే ఎక్కువ సుఖపడుతోంది. ఉన్నపూట తిని, లేనిపూట కడుపులో కాళ్ళుపెట్టుకొని సుఖంగా పడుకుంటారు. పైగా తనేమో సుఖపడిపోతున్నట్టు కళ్ళలో నిప్పులు పోసుకుంటారు. రెండుకళ్ళతో చూడలేరు. ఐనవాళ్లు కానివాళ్లుకూడా తనని చూసి ఏడుస్తారు. వీళ్ళకుతోడు! ఈ అలగా జనంకూడా తన పాలిటే పడాలీ?

వీళ్ళు సిరుసులు పగల! వీళ్ళతో ప్రాణం విసిగిపోతుంది.

రత్తమ్మ పెళ్ళు పెళ్లున మెటికలు విరిచింది.

ఒక్కడూ సరిగా మాట వినడు. వళ్ళొంచి పని చెయ్యడు. అదేమంటే ఎదురు సమాధానం ఇస్తారు! నానాటికీ ఈ అలగా జనం పెచ్చు మీరిపోతున్నారు. పెద్దవాళ్ళ దగ్గర ఎట్లా మసలుకోవాలో మర్చిపోతున్నారు.

ఆ మిషనీవాడు, వాడి బతుక్కువాడు, వెధవ! తనకు ఎదురు మాట్లాడుతాడా? బట్ట కాజేయటమే కాకుండా రవికలు కుదరకుండా కుట్టుకొస్తాడు. అదేమంటే ఎంత మాటన్నాడు?

“ఈ గొప్పోళ్ళంతా నాయంగా వుండే ఇంత పెద్దోళ్ళవుతున్నారా?” అని కూస్తాడా?

కూస్తాడు! కూస్తాడు? ఎందుకు కుయ్యడూ? పక్కడేకలు విరగతన్నేవాళ్లు లేకపోతే ఎన్నయినా కూస్తాడు.

చాకలికి బట్టలు వేస్తే ఎక్కడ మురికి అక్కడే పెట్టి

తీసుకొస్తాడు. పైగా బట్టలు చింపుకొస్తాడు. అదేమంటే తన కిచ్చే జీతానికి ఆ పని ఎక్కువేనంటాడు. ఎంత ధైర్యం?

చాకలి దగ్గర్నుంచీ, పాకీవాడివరకూ, మాటకు ముందు జీతం పెంచమంటారు. తమ దగ్గిరి డబ్బు రాసులు పోసివుందని వాళ్ల భావం! ఎంత కష్టపడితే ఈ మాత్రం హోదా, డబ్బూ, సంపాదించ గలిగారు?

వీళ్ళ గుడ్లు మూడ! వీళ్ళ చూపులు మండ! వీళ్ళ కళ్ళన్నీ తన భర్త సంపాదన మీదే!

తన భర్త చేసిన త్యాగం వీళ్ళకేం తెలుసు? దేశ స్వాతంత్ర్యంకోసం ఎన్నిసార్లు జైలు కెళ్ళలేదు? ఎన్ని బాధలు పడలేదూ? ఎన్నిరోజులు తమ కుటుంబం పస్తు పడుకోలేదూ.

ఆ మహాత్ముని చలవవల్ల ఏదో ఈనాడు ...స్వతంత్రం వచ్చాక, తమ కష్టాలు ఇరగడైనాయ్ అనుకుంది. కాని ఈ జనం సుఖంగా వుండనిస్తారా?

తన భర్త ఎం. పి. కాగానే సరిపోయిందా? ఎన్ని బాధ్యతలు నెత్తిన పడ్డాయి! నానాగడ్డీ కరిస్తేగాని యమ్. పి. కాలేదు. తాము సుఖపడిపోతున్నట్లు అందరూ అనుకోవడం!

ఎంతమందికి జవాబులు చెప్పాలి? ఆయనకు పట్టుమని పదిరోజులైనా పెళ్లాం బిడ్డల్తో గడిపే తీరిక కూడా వుండదు.

జీవితాన్నే ప్రజలకు అంకితం చేశారు ఆయన. ఎవరు గుర్తిస్తున్నారు? పైగా తామేదో సుఖపడిపోతున్నట్లు ప్రతి వాడూ ఏడవటమే నాయె?

పనిమనిషి దగ్గిర్నుంచే వంటవాడిదాకా తనమీద కత్తికట్టేవాళ్ళే! ఒక్కళ్ళూ చెప్పినమాట సరిగా వినరు.

ఆ సుబ్బముండ సరేసరి! సందు దొరకడం ఆలస్యం ఏదో ఒకటి బొడ్లో దోపుతుంది. ఎంత మందిని మార్చింది. అందరు ఇట్టాగే చచ్చారు. రామ! రామ! మంచికాలం లేకుండా పోయింది.

అబ్బ! ఆ 'లక్ష్మి' కళ్ళు — తల్చుకుంటేనే వళ్ళు గరపొడుస్తుంది. ఆ గుడ్లు పడ్డయ్యా నల్లరాయి బద్దలు కావాల్సిందే! ఆరోజు కారోజు....పసివాడి చేతిలో మిఠాయి మీద దాని కళ్లు పడనే పడ్డాయి. సాయంత్ర మయ్యేప్పటికి బిడ్డకు పుట్టెడు జ్వరం ముంచుకొచ్చింది. దాని చూపులూ.... అదీ....ముదనష్టపు ముండ!

కాలమే మారిపోయింది. పిదపకాలం పిదప బుద్ధులు! తన చిన్నతనంలో ఈ అలగాజనం ఎంత అణిగి మణిగి పడి వుండేవాళ్లు? ఆ ఇంగ్లీషువాడి రాజ్యమే బాగుంది. ఇప్పుడు ప్రతి అడ్డమైనవాడూ, మాట్లాడితే 'హక్కులు' అంటూ బయలుదేరుతున్నాడు.

ఆ రోజుల్లో వాళ్ళు నలుగురు పెద్దమనుషులు నడిచే దార్లో నడిచేవాళ్లా? ఒదిగి పక్కగా నిలబడేవాళ్ళు. పేరెత్తి పిల్చేవాళ్ళా?

"దొరగోరూ! దొరసానమ్మగోరూ!" అంటూ వంగి నిల్చునేవారు.

ఇప్పుడేముంది. నిటారుగా నిలబడి "రత్తమ్మగారూ సాంబయ్యగారూ!" అనడం సాగించారు.

ఇంకా రెండు రోజులు పోతే "రత్తమ్మా, సాంబయ్యా!" అనేట్టూ వున్నారు?

ఇందుకేనా తన భర్తలాంటివాళ్లు అనేక త్యాగాలు చేసి స్వరాజ్యం తెచ్చింది?

అసలు గాంధీగారూ, గాంధీగారి శిష్యులూ వీళ్ళకు రెక్కలు తెచ్చారు.

ఇక ఈ కమ్యూనిష్టోళ్ల సంగతి చెప్పనే అక్కర్లేదు. అసలు జనాన్ని పాడుచేసిందే వాళ్లు. అందరూ సమానమట! వాళ్ళకూ మనలాగే బతికే హక్కు వుందట!

ఎంత విడ్డూరం? ఐదేళ్లు ఒకటిగా వుంటాయా? గాడిద గుర్రం అవుతుందా? అందరిలా బతికే హక్కంటే బతకమనరాదూ? ఎవరొద్దన్నారూ? తిన్న తిండి వంటపట్టకుండా డబ్బున్న వాళ్ళమీద ఎందుకు విరుచుకు పడటం?

కలి పురుషుడు ఉద్భవించి ఈ కుక్కమూతి పిందెల్ని ఏరేస్తేగాని మళ్లీ ధర్మం నాలుగుపాదాలా నడవదు.

"ఓ శ్రీమన్నారాయణమూర్తీ! ఎక్కడున్నావురా తండ్రీ? ఈ పాపం ఇంకెన్నాళ్ళకు పండుతుందిరా నాయనా!"

చేతులెత్తి ఆక్రోశించింది రత్తమ్మ.

"అసలు! మనలో మనమాట! నా ఇంట్లో ఏం చేసుకుంటున్నానో? ఏం తింటున్నానో? ఇంత డబ్బు మాకు ఎలా వచ్చిందో ఈ బజారు ముండలందరికీ ఎందుకు చెప్పండి?"

పైకే అనేసింది రత్తమ్మ.

మళ్లీ ప్రతివాళ్ళూ పర్మిట్లకోసం, ఉద్యోగాలకోసం, కాలేజీ సీట్లకోసం తన మొగుడుచుట్టూ తిరిగేవాళ్ళే!

తన భర్త అసలే అమాయకుడు! తనుకూడా తెలివి తక్కువదే అయితే ఇంకేమైనా వుండేదా? తన దగ్గిర వాళ్ళ పప్పులేమీ ఉడకవు. అప్పటికీ తన కళ్లు కప్పి తన భర్త సహాయంతో పైకొచ్చిన వాళ్లు ఎందరు లేరు?

పక్కింటి కాంతమ్మ-చూడబోతే తాలూకాఫీసులో గుమస్తా పెళ్ళాం! దాని ఇరగబాటు అంతా ఇంతా కాదు. ఓయబ్బో! దాని మొగుడే తాసిల్దారయినట్టు నేల మీద నడవదు. పుట్టింటివాళ్లు కాస్త తడిగలవాళ్ళని, దాని అలపం భూమి పట్టకుండా వుంది. దాని పిల్లల్ని తన పిల్లల్తో సమానంగా వుంచాలని పోటీ పడుతుంది. తన కూతురు కట్టుకొనే చీరల్లాంటి చీరలే తన కూతురుకూ కొంటూంది. పిల్లల మనసు నొప్పించకూడదట.

నక్క ఎక్కడా నాగలోక మెక్కడ? ఎంత విరగబడితే మాత్రం దాని పిల్లలు తన పిల్లలతో సమానం అవుతారా? అసలు తమతో దానికి పోటీ ఏమిటంట? తన కూతురికంటే దాని కూతుర్ది కొంచెం ఎర్రతోలైతే కావచ్చు అంతమాత్రానికే అంత విరగబడాలా? దాని తెలివిమండ! ఆ పిల్లవి అన్నీ రాలుగాయి మాటలే!

ఊపిరాడని ఆలోచనలతో ఉస్సురుస్సురు మంటూంది రత్తమ్మ.

"ఏమే రత్తమ్మా! భోజనాలయ్యాయా?" అంటూ

వారవాకిలిగా వేసివున్న తలుపులు తోసుకొని కోటమ్మ లోపలకు వచ్చింది.

కోటమ్మ భర్త చిన్నతనంలోనే పోయాడు. ఆ ఊళ్లో ఆమె ఎక్కని గడపా, పట్టించుకోని విషయం, వుండదనే చెప్పాలి.

కోటమ్మను చూడగానే రత్తమ్మ ముఖం చేటంత అయింది.

"రా కోటమ్మొదినా! ఈ మధ్య బొత్తిగా నల్ల పూసవై పోయావేం!" అన్నది రత్తమ్మ ఉత్సాహంగా.

"మొన్ననేగదే వచ్చి పోయాను. నిన్నసంతా కాంతమ్మ ఇంట్లోనే సరిపోయింది," రత్తమ్మ పక్కగా కూర్చుంటూ అన్నది కోటమ్మ.

"ఏం విశేషం! వాళ్ళ పుట్టింటి వాళ్లెవరైనా వచ్చారా!" అన్నది రత్తమ్మ కోటమ్మకు దగ్గిరిగా జరుగుతూ.

"ఆఁ అదేంకాదు. మనలో మనమాట నీకు తెలియదటే?" రాగం తీసింది కోటమ్మ.

"ఏమిటే? నాకేం తెలుసూ?" రత్తమ్మ కనుబొమలు ముడిచింది.

"నిన్న వాళ్ళ సరళను చూసుకోవడానికి వచ్చారుగా?"

"అట్లాగా? నాకు తెలియదే! ఏ ఊరేమిటి! మంచి సంబంధమేనా? ఆఁ మంచి సంబంధాలు ఎక్కడున్నంచి

వస్తాయిలే ఈ రోజుల్లో కట్నాలు గుమ్మరించం దే!" ఊపిరి పీల్చుకొని మళ్ళా అన్నది రత్తమ్మ—

"మనలో మనమాట! అసలే ఆ కాంతి నోరు మంచిది కాదు. మళ్లీ అనేవ్? పొట్టకూటికి గతిలేని వాళ్ళకు బి. ఏ. లూ-ఎం.ఏలూ చదివినవాళ్లెక్కణ్ణుంచి వస్తార్లే! ఏదో గంతకు తగ్గ బొంత!" బాధపడుతున్న తన మనసుకు తనే సమాధానం చెప్పుకుంటున్నట్టు అన్నది రత్తమ్మ.

"కాదే రత్తమ్మా! చాలా మంచి సంబంధం! పిల్ల అదృష్టం...."

"అహా! అంత గొప్ప సంబంధమా?" మధ్యలో అందుకొని వెటకారంగా అన్నది రత్తమ్మ.

"అదేనే ఆ మధ్య నీ కూతుర్ని చూట్టానికి ఎవరో వచ్చారుగా? వాళ్లు చాలా గొప్పవాళ్ళని నువ్వే చెప్పావుగా? వాళ్లే వచ్చారు!" అన్నది కోటమ్మ రత్తమ్మ ముఖంలోకి చూస్తూ.

"ఏంటీ? అంతా వట్టిదే! వాళ్ళేమిటి గుమాస్తా కూతుర్ని చేసుకోవడం ఏమిటి? ఆ కాంతెమ్మ కాలాంతకురాలు. ఎన్నయినా కల్పిస్తుంది," అగాధంలోకి కృంగిపోతూ అన్నది రత్తమ్మ.

"అబద్దాలు చెప్పాల్సిన కర్మ నాకేం పట్టిందే?" అంటూ కోటమ్మ స్వరం పెంచింది.

కోటమ్మ నోరు అంటే ఆ ఊళ్లో అందరికీ హడలే! ఆ నోటికి అడ్డేం వుండదు. ఆఖరుకు రత్తమ్మకూడా కోటమ్మ నోటికి భయపడుతుంది.

"అది కాదే కోటమ్మొదినా? నిన్నెందుకంటానే అబద్ధాలాడావని? వాళ్ళు నీకు అబద్ధాలు చెప్పి వుంటారని అన్నాను. ఐనా కావచ్చులే. వాళ్ళ వంశం మంచిది కాదట. అందుకే మా పిల్లను ఇవ్వం అన్నాం!" అన్నది రత్తమ్మ తగ్గిపోతూ.

కోటమ్మ ఆశ్చర్యంగా రత్తమ్మ ముఖంలోకి చూసింది.

"పిల్లవాడు మంచివాడు కాదట. ఎక్కడా మంచి సంబంధం దొరక్క కాంతమ్మ కూతుర్ని వెతుక్కుంటూ వచ్చి వుంటారు. ఇదిగో కోటమ్మొదినా! ఆ కాంతానికి చెప్పి. పిల్లముండ గొంతు కోయ్యొద్దని."

"అదేమిటే రత్తమ్మా? నిన్నటిదాకా వాళ్ళనూ, వాళ్ళ వంశ గౌరవాన్నీ తెగ పొగిడావ్‌గా? అసలు సంగతేమిటో తెలుసా? మీ పిల్ల వాళ్ళకు నచ్చలేదట. మీ ఇంటికి వచ్చినరోజే పిల్లవాడు కాంతం కూతుర్ని చూశాడట. కట్నం లేకపోయినా ఆ పిల్లనే చేసుకుంటానని మొండికెత్తాడట."

కోటమ్మ మంటకు మరో రెండు కట్టెల్ని చేర్చింది.

రత్తమ్మపని తలుపులుమూసి కొట్టిన పిల్లిచందమైంది. కస్సున లేచింది.

"మహా చెప్పొచ్చావులే? అపుమా? అందరూ మమ్మల్ని రెండుకళ్ళతో చూడలేక ఏడ్చేవాళ్ళే! మమ్మల్ని అన్యాయంగా ఆడిపోసుకున్న వాళ్లెవరూ బాగుపడర్లే!" రత్తమ్మ కడుపుమంటతో తిట్లకు లంకించుకుంది.

"అయ్యో! నన్నెందుకు తిడతావే రత్తమ్మతల్లీ?

ఎవరే గంగలో కలిస్తే నాకేమే! నాకుమాత్రం ఏ వంద మంది పిల్లలున్నారు? వాళ్ళకు ఏగదని నాకేం దిగులా?" అంటూ కోటమ్మ తను వచ్చిన కార్యం సవ్యంగానే సాధించి నందుకు లోలోపల సంతోషపడింది.

కోటమ్మ, రత్తమ్మ గుమ్మం దాటగానే తిట్లకు లంకించుకొని ఆ వీధి మలుపు తిరిగేంతవరకూ తిడ్తూనే పోయింది.

రత్తమ్మకు దూరంగా కోటమ్మ గొంతు విన్పిస్తూనే వుంది. రత్తమ్మకు తేళ్ళు కుట్టినట్టయింది.

వీధిలోకిపోయి కోటమ్మతో పోట్లాట్టానికి, తన గౌర వానికీ, తన గొప్పతనానికీ భంగం కనక, గడపలోనే కూర్చుని, కప్పు లేచిపోయేట్టు, గొంతెండేదాకా, కాంత మ్మనూ, కాంతమ్మ కూతుర్నీ, కోటమ్మనూ దుమ్మెత్తి పోసింది రత్తమ్మ.

రత్తమ్మ కడుపుమంట తగ్గింది. కాని వళ్ళు నీరసించి పోయింది.

వంటింట్లోకి పోయి చెంబెడు మంచినీళ్లు గట గటా తాగి, మంచంమీద మేను వాల్చింది.

"అమ్మగారూ?" వీధి వాకిట్లోంచి కేక విన్పించింది.

"ఎవరూ?" అంటూ రత్తమ్మ లేచి కూర్చుంది.

"నేనండీ! మిషినీ సాయిబు కొడుకుని. మా అయ్యా డబ్బు లిప్పించుకు రమ్మన్నాడు."

పదేళ్ళ కుర్రాడు వసారాలోకి వచ్చి రత్తమ్మ ఎదు రుగా నిల్చున్నాడు.

"ఏం డబ్బులూ ?" రాగం తీసింది రత్తమ్మ.

"కుట్టు కూలి." అన్నాడు కుర్రాడు.

"అప్పుడే ఇచ్చాంగా ?" రత్తమ్మ హూంకరించింది.

"ఇంకా రూపాయిన్నర ఇయ్యాలంటండీ !

"ఎవర్రా చెప్పిందీ ! పిల్లవి రెండు చొక్కాలూ, నా రవికా, మీ దెవసాన కొట్టుకొన్నారుగా ! కంచి పట్టు రవికబట్ట ! ఎందుకూ పనికిరాకుండా కుట్టాడు."

"అదంతా నాకు తెలవదండీ ! మా అయ్య డబ్బు లిప్పించుకు రమ్మన్నాడు," అన్నాడు కుర్రాడు భయం భయంగా.

ఛీ ! వెధవకుంకా ! ఫో ! అవతలికి !" రత్తమ్మ గుడ్లురజేసి గర్జించింది.

దాంతో ఆ కుర్రాడు ఒక్క పరుగుతో వీధిలోకి వచ్చి పడ్డాడు. వీధి మలుపు తిరిగాకగాని నిల్చుని ఊపిరి పీల్చుకోలేదు.

రత్తమ్మ మళ్ళీ మంచంలో కూలబడింది. ఒక కునుకు తీద్దామని కళ్లు మూసిందోలేదో ప్రహరీ గోడమీద వాలిన కాకి "కా ! కా !" అని అరవడం మొదలు పెట్టింది.

"ఇషూ ! ఇషూ ! రత్తమ్మ పడుకొనే కాకిని అదిలించింది.

అదీ రత్తమ్మ మీద పంతానికి వచ్చినట్టు ఇంకా గట్టిగా అరవసాగింది.

చెప్పొద్దూ ? ఏదో మధ్యాహ్నంపూట ఒక కునుకు తీద్దామని నడుం వాల్చిన రత్తమ్మకు చిర్రెత్తుకొచ్చింది.

"ఒసి! నీయమ్మ కడుపు కాలా! నీకేం పోయే కాలమే!" మంచం పక్కనే వున్న కర్రపుల్లతీసి కాకిమీదకు గిరాటు వేసింది.

కర్రపుల్ల గోడమీదగా దూసుకుపోయి వీధిలో పడింది.

కాకి రివ్వున ఎగిరిపోయింది.

"ఎవళ్ళకు పోయేకాలం వచ్చిందిరా? ఇంకా తస్సయితే కన్నుపోయి వుండేది, వాళ్ళ చేతులిరగా?" ఒక బోడెమ్మ దొడ్డి గుమ్మం తీసుకొని కర్రపుల్ల చేత్తో పట్టుకొని లోపలకు ప్రవేసించింది గలగలమంటూ తిడుతూ.

జరిగిందేమిటో గ్రహించిన రత్తమ్మ మంచంమీద గుర్రపెట్టి నిద్రపోతున్నట్టు నటించింది.

ఆ వచ్చిన విధవావిడ కొంచెంసేపు పరకాయించి చూసి తిట్టుకుంటూ తిరిగి వెళ్ళిపోయింది.

ఆవిడ అటు వెళ్ళగానే రత్తమ్మ లేచి కూర్చుంది.

తనమీద తనకే కోపం వచ్చింది.

"ఈ పాపిష్టి లోకంలో ఎంత దొంగ బతుకు బతకాల్సి వచ్చిందిరా భగవంతుడా!" అనుకుంది.

లేచి వెళ్ళి వీధి తలుపు గడియ పెట్టింది. మళ్ళీ వచ్చి పడుకుంది.

తీరా నడుం వాల్చిందో లేదో వీధి తలుపు "ధన ధనా!" కొట్టసాగారు.

"అబ్బబ్బ! ఈ మాయదారిమంద నన్ను బతకనివ్వర్రా!" అంటూ పోయి తలుపు తెరిచింది.

చాకల్ది బట్టలు తీసుకొని లోపలకు వచ్చింది.

"ఏమిటే ఆ తలుపులు బాదటం!" విసుక్కుంది రత్తమ్మ.

బంగారి తనను కానట్టే మూట కింద దించి, బట్టలు లెక్కపెట్టి పక్కన పెట్టింది.

"మొన్నటి బట్టల్లో కాంతమ్మగారి చిన్నమ్మాయి జాకెట్ వచ్చిందండీ!" అన్నది బంగారి - రత్తమ్మతో.

"ఏందే వచ్చిందీ?" రత్తమ్మ బుస్సున లేచింది.

"ఎర్ర రంగు పట్టు జాకెట్ అండీ!"

"నీ బొంద పడ! అట్టాంటిది మా ఇంట్లోనే లేదు గదే!"

"మీ ఇంటోనే యేసినట్టు బాగా గ్యాపకం అమ్మ గోరూ! ఒకసారి సూడండి!"

"వాసేవ్! అట్టాంటి తప్పుడు కూతలు కూశావంటే పళ్లు రాల్తయ్! దొంగముండా! కాజేసి మా ఇంట్లో వేశా నంటా వేమే!" రత్తమ్మ బంగారి పైపైకి వచ్చింది.

ఇంతలోకే రత్తమ్మ కూతురు, రెండోది, పదేళ్ళది, వీధిలోనుంచి పరిగెత్తుకుంటూ వచ్చింది.

పిల్ల వంటిమీది చొక్కా చూసి "అదేనండీ అమ్మ గోరూ!" అన్నది బంగారి ఆత్రంగా.

రత్తమ్మ గతుక్కు మంది.

క్షణంలో తెప్పరించుకొని బంగారి మీదకు తోడే లులా లేచింది.

"మొన్న వాళ్ళ నాన్న మద్రాసునుంచి కొనుక్కొచ్చిన బట్ట అయితే, అది కాంతమ్మ కూతుర్ది అని వాగుతావంటే ముదనష్టం ముండా !"

"ఏమో ఆ పాపం ! పున్నెం ! ఆ బగవంతుడికే తెలియాలి" అన్నది చాకల్ది.

"నీ తాడు తెగ – మళ్ళీ అదే కూత కూస్తావేమే ?" చేతులు చాచింది రత్తమ్మ.

"మాటలు తిన్నగా రానీయండమ్మగోరూ !" ఎదురు తిరిగింది చాకల్ది.

"వొసేవ్ ! రేపట్నుంచి మా ఇంటికి రావద్దు మానేసేయ్ !" గొంతు పెకలించుకొని అరిచింది రత్తమ్మ.

"అట్టాగే మానుకుంటా ! నాకు రావాల్సిందేదో ఇట్టా పారేయండి !" అంటూ బంగారి మూట భుజాన వేసుకొని చర చరా వెళ్ళిపోయింది.

రత్తమ్మకు చిర్రెత్తిపోయింది.

పక్కనే నిల్చున్న కూతుర్ని సాగదీసి నాలుగు బాదింది. పిల్ల బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టింది.

రత్తమ్మ కూతుర్ని అలా ఎందుకు కొట్టిందో రత్తమ్మ మనసుకే తెలియాలి.

ముఖాన కారుతున్న చెమట తుడుచుకొని "ఉస్సురుస్సురు" మంటూ వెళ్ళి మళ్ళీ మంచానికి అడ్డం పడింది.

రత్తమ్మకు మాగన్నుగా నిద్ర పట్టిందో లేదో పక్కింటివారి అమ్మాయి హార్మోనియంపెట్టె 'ఘాంయ్' మంటూ మ్రోగింది—

"శాంతమూ లేకా - సౌఖ్యమూ లేదూ !" నాలుగు స్వర శృతిలో పాట సాగింది.

రత్తమ్మ మెదడులో తాటాకుల మంటలు లేచినై.

చివ్వున లేచింది.

గోడకు నిచ్చెన వేసి, గోడపైగా యుద్ధానికి తల పడింది.

గాలివాటున రత్తమ్మ తిట్లు రత్తమ్మ ముఖంమీదకే తిరిగి వచ్చాయి. అటువైపు వినిపించుకున్నవా ళ్లెవరూ లేరు.

పైగా ఆ అమ్మాయి శృతి పెంచింది. ఆ పద్దాను గేళ్ళ పిల్ల తనమీాద పగపట్టి ఇలా సాధిస్తుంది అనుకుంది రత్తమ్మ.

తిట్టీ తిట్టీ నోరెండి, నిచ్చెన దిగింది రత్తమ్మ. దిగుతూ దిగుతూ నిచ్చెన జారి కింద పడింది రత్తమ్మ.

మోకాలు కలక పట్టింది.

"అయ్యో రామయ్య తండ్రీ! నా కష్టాలు ఎన్నటికి తీరునురా తండ్రీ!" మోకాలు తోముకుంటూ ఆక్రోశించింది రత్తమ్మ.

"ఏందమ్మగారూ ఆడ కూకుండారూ !" అంటూ పని మనిషి లోపలకు వచ్చింది.

"అది సరేగానీ! నిన్న రాలేదు. ఎక్కడ చచ్చావ్?" తీక్షణంగా చూస్తూ అన్నది రత్తమ్మ.

"సాలా ఇబ్బందయే రాలే దమ్మగోరూ! నిన్న మా పేటలో ఒకడు సచ్చిపోయాడు," అన్నది పనిమనిషి.

"చావు మంచోళ్ళకు దబ్బునే వస్తదే! నీకూ నాకూ రాదు కానీ!"

"మనకీ వస్తదమ్మా బూమ్మీద నూకలు నిండితే!"

రత్తమ్మ గుండెలు చిక్కబట్టినై, కాలు కలుక్కుమంది.

"వోసి! వాడిగల ముండా! ఎంత మాట పడ్తే అంతమాట టంటావటే!" అనుకుంది రత్తమ్మ మనసులోనే.

"సరే! సద్దుగానిలే! ముందా అంట్లు తోము! రెండు రోజుల్నుంచి మురిగిపోతున్నయ్!" అన్నది రత్తమ్మ.

రామి అంట్లు తోమిపెట్టి పెద్దబావికి మంచినీళ్ళకు వెళ్ళింది.

వంటింట్లో పళ్ళెం కిందపడ్డ చప్పుడైంది.

"అబ్బబ్బ! ఎవర్రా అదీ?" అంటూ రత్తమ్మ వంటింట్లోకి పరిగెత్తింది.

ఖాళీ నేతిగిన్నె రత్తమ్మ ముఖంలోకి బావురుమంటూ చూసింది.

రత్తమ్మ గుండెలు బాదుకుంటూ పంచాంగం విప్పింది.

"దీని తాడు తెగ! దీనికేం పోయేకాలం వచ్చిందీ! దొంగ ముండను రానియ్! పక్క లిరగతన్నిస్తా!"

బావినుండి బిందె చంకన పెట్టుకొని వచ్చిన రామి రత్తమ్మ వాలకం చూసి బిగిసిపోయి నిల్చుంది.

రత్తమ్మ రౌద్రాకారం దాల్చింది.

హిడింబిలా రామిమీదకు దూకింది.

రత్తమ్మతల్లికి నిండా కోపం వస్తే మనిషే కాదు.

రామి భుజానవున్న బిందె కింద పడేసింది. రత్తమ్మ చేతుల్నుంచి జుట్టు విడిపించుకొని గిర్రున వెనక్కు తిరిగింది.

పోతూ పోతూ అదీ తిట్లకు తగులుతుంది. దాని నోరూ అంత మంచిది కాదు.

"అయ్యో! నా బిందె"- రత్తమ్మ చొట్టలు పోయిన బిందెను కావిలించుకుంది.

నీళ్ళ బిందెను ఈడ్చుకుంటూ రత్తమ్మ ఇంట్లోకి పోయింది.

తల - నొప్పితో పగిలిపోతూంది.

"అన్నట్టు మధ్యాహ్నం కాఫీ తాగలేదాకదూ!" అనుకుంటూ అలమారు దగ్గరకెళ్ళింది. పాలగిన్నె మూత కింద పడివుంది. పాలగిన్నె జాలిగా రత్తమ్మ ముఖంలోకి చూసింది.

రత్తమ్మకు మూర్ఛవచ్చినంత పనైంది.

"శ్రీమన్నారాయణమూర్తీ! ఇక ఈ బాధలు నేను భరించలేనురా తండ్రీ!"

రత్తమ్మ చేతులు పైకెత్తి తల బాదుకుంది.

రత్తమ్మ ఎత్తిన తల అలాగేవుంచి పైకి చూసింది. అటకమీద కూర్చున్న నల్లపిల్లి మూతి నాక్కుంటూ రత్తమ్మ కేసి కొంటెగా చూసింది.

"ఓసి నీయమ్మ కడుపుకాల! నీకేం పుట్టిందే!" అంది రత్తమ్మ పిల్లి కేసి చూస్తూ.

పిల్లి రత్తమ్మను చూసి కళ్ళురిమి గుర్రుమన్నది.

"ఒసి! నీ శిరుసుమండ? నేను నిన్నేంచేశానే? నువ్వు కూడా నాకు శత్రువయ్యావంటే?" అంటూ రత్తమ్మ వంటి ల్లోనుండి బయటకు ఒక్క దూకు దూకింది.

రత్తమ్మ వాకిట్లోకి వచ్చేసరికి వాకిలిముందు—

"కళ్లులేని కబోధి పక్షులము నారాయణా! ధర్మతల్లివి నీవు సీతమ్మా!"

అంటూ అరుస్తూ, నలుగురు బిచ్చగాళ్లు తయారయారు

"చాల్లే! ఫో! ఫోండి!" ఎద్దుల్లాగున్నారు పనిచేసుకో కూడదూ?" కసురుకుంది రత్తమ్మ.

వాళ్ళు వినిపించుకుంటేగా? గొంతులు పెద్దవిచేసి "ధర్మతల్లివి నీవు సీతమ్మా! కళ్లులేని...."

రత్తమ్మకు మతిపోయినంత పనైంది.

"ఈ జాతరేంటిరా భగవంతుడా? ఊళ్లో ఇన్నిళ్లుంటే ఈ మాయదారి మందకు మా ఇల్లే కన్పించాలా? అంటూ తలుపులు ధభీ" మని వేసింది.

ఇంట్లోకి పోతున్న రత్తమ్మను చూసి గోడమీాది కాకి బొంగురు గొంతుతో అరుస్తూంది.

వంటింట్లోనుండి మూతి నాక్కుంటూ వస్తున్న నల్ల పిల్లి రత్తమ్మను చూసి బుసకొట్టింది.

పక్కింటి అమ్మాయి "శాంతమూ లేకా సౌఖ్యమూ లేదూ" అంటూ రోడ్డు ఇంజను ధ్వనిని మించి పాడుతోంది.

రత్తమ్మ తల్లికి పిచ్చెత్తిపోయింది. గంగవెర్రులెత్తి పోయింది. కాళ్ళు పట్టు తప్పి పోతున్నాయ్.

గుండెల్లో ఆయాసం.

వళ్లు చెమటలు కమ్మింది.

రత్తమ్మ బుర్రలో హోరు సాగింది. వంటింట్లో కుప్ప కూలబడింది.

రెండు చేతులూ పైకెత్తి ప్రార్థించింది.

"ఓ ఆపద్బాంధవా! దుష్టశిక్షకా! శిష్టరక్షకా! ఇంకా నీకు దయ రాలేదా? ఓ కలిపురుషుడా? ఎప్పుడు చేస్తావయ్యా ఈ పాపుల సంహారం?"

వళ్ళు నీరసించి, ప్రాణం శోషకొచ్చి, అర్ధనిమీలిత నేత్ర అయిన రత్తమ్మ హృదయంలో ఖడ్గం చేతధరించి వీర భోగవసంత రాయుడు ఎక్కివస్తున్న గుర్రపు డెక్కల చప్పుడు లీలగా వినిపించింది.

అయితే బయట బిచ్చగాళ్ళ గోలా, మిషినీ సాయబు కేకలు, పనిమనిషినోరూ, కోటమ్మ సాధింపూ, వంటింట్లో పిల్లీ, ప్రహారీగోడమీద కాకీ, పక్కింటి అమ్మాయి హార్మోనియం రొదా, రత్తమ్మ చెవుల్లో దూరి, కలిపురుషుడు ఎక్కివస్తున్న గుర్రపు డెక్కల చప్పుడు వినకుండా చేస్తున్నాయ్.

పాపం! రత్తమ్మ తల్లికి రారాని కష్టాలే వచ్చాయి.

ఏనాటికైనా రత్తమ్మ తల్లి కష్టాలు విరగడ అవుతాయో లేదో చూద్దాం!

—)o(—